## ప్రజాజ్యోతి తెలుగు జాతీయ పత్రికకు విలేకరులు కావలెను

* కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా వార్తల్లో ముందుకు దూసుకుపోతున్న ప్రజాజ్యోతి దినపత్రిక కు వివిధ మండలాలకు రిపోర్టర్లు కావలెను
* బాన్సువాడ టౌన్, కామారెడ్డి టౌన్, కామారెడ్డి ఆర్బి, బిచ్కుంద, బీర్కూర్, తాడ్వాయి, లింగంపేట, నస్రుల్లాబాద్, మండలాలకు రిపోర్టర్లు కావలెను
* కనీస విద్యార్హత ఉంటే సరిపోతుంది. మిగతా వివరాలకు

ఈ క్రింది నెంబర్ ను సంప్రదించండి.

96665 56646



జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

నిజామాబాద్ కామారెడ్డి




## కామారెడ్డి అభివృద్ధే నా ధ్యేయం

**- రూ. 65.80 కోట్లతో అమృత్ 2.0 పనులకు షబ్బీర్ అలీ శంకుస్థాపన**



**కామారెడ్డి ప్రతినిధి జనవరి 24. (ప్రజాజ్యోతి)** కామారెడ్డి పట్టణ ప్రజల తాగునీటి కష్టాలను తీర్చి, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. కామారెడ్డి పట్టణంలో శనివారం అమృత్ 2.0 (అమృత్ 2.0) పథకం కింద రూ. 65 కోట్ల 80 లక్షల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. తాగునీటి సౌకర్యం కోసం భారీ కేటాయింపులుపట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పెరిగిన జనాభాకు అనుగుణంగా

- మిగతా 2లో..

## శాంతియుత వాతావరణంలో రంజాన్ జరుపుకోవాలి

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**



**కామారెడ్డి ప్రతినిధి జనవరి 24 (ప్రజాజ్యోతి)** రానున్న రంజాన్ పండుగ ఏర్పాట్లపై శనివారం కామారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడిఓసి) లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సంబంధిత శాఖల అధికారులు , ముస్లిం సోదరులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రంజాన్ పండుగను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రంజాన్ పండుగను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా

- మిగతా 2లో..

## పదోన్నతులు పోలీసుల్లో బాధ్యతను పెంచుతాయి

- నిజాయితీతో కూడిన సేవలే పోలీసులకు గుర్తింపు
- జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర

2 లో



## బాంబ్ బ్లాస్టింగ్‌తో భయాందోళనలు



-ఆందోళనలు గ్రామస్తులు
- ఆ శివారులోని గుట్టపై చర్యలు తీసుకోరా..?
- ఈసన్నపల్లి గ్రామ శివారులో
-గత 20 సంవత్సరాల నుండి తవ్వకం
- బాధితులు ఆవేదన
- ఆ కంకర మిషన్‌లను ఎత్తివేయాలి
--గుట్ట పై బాంబ్ బ్లాస్టింగ్ తో భయబ్రాంతులు

2 లో

# కామారెడ్డి అభివృద్ధే నా ధ్యేయం

తాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు నాలుగు నూతన భారీ వాటర్ ట్యాంకుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.ఇస్లాంపుర కాలనీ: 5 లక్షల లీటర్ల సామర్థ్యం (రూ. 1.02 కోట్లు)
లిటిల్ స్కాలర్ స్కూల్ ప్రాంతం: 5 లక్షల లీటర్ల సామర్థ్యం (రూ. 1.03 కోట్లు)
గ్రీన్ సిటీ కాలనీ: 5 లక్షల లీటర్ల సామర్థ్యం (రూ. 1.02 కోట్లు)
డ్రైవర్స్ కాలనీ: 5 లక్షల లీటర్ల సామర్థ్యం (రూ. 1.02 కోట్లు)
వీటితో పాటు పట్టణంలోని వికాస్ నగర్ , లింగాపూర్ వార్డులలో సిసి రోడ్ల నిర్మాణ పనులను కూడా ఆయన ప్రారంభించారు.

**అభివృద్ధే చరిత్రలో నిలుస్తుంది: షబ్బీర్ అలీ**

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో షబ్బీర్ అలీ మాట్లాడుతూ ?ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయి.. మనుషులు కూడా శాశ్వతం కాదు. కానీ మనం చేసే అభివృద్ధి పనులు మాత్రమే కలకాలం నిలిచిపోతాయి. ప్రజల అవసరాలను గుర్తించి పని చేసినప్పుడే మన పేరు చరిత్ర పుటల్లో నిలుస్తుంది.రాజకీయం అనేది నీతిగా, నిజాయితీగా ఉండాలని, ప్రజల గుండెల్లో చోటు సంపాదించుకోవడమే అసలైన విజయమని ఆయన పేర్కొన్నారు.నేను ఎప్పుడూ కుల మత రాజకీయాలకు దూరంగా ఉంటాను. అభివృద్ధి విషయంలో వివక్షకు తావు లేదు. అందరికీ సమానమైన ఫలాలు అందాలన్నదే నా ఆకాంక్ష" అని స్పష్టం చేశారు.అభివృద్ధే నా గుర్తింపు: కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని, కేవలం మాటలతో కాకుండా పనులతోనే ప్రజల మెప్పు పొందుతానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు పెద్ద సంఖ్యలో పట్టణ ప్రజలు పాల్గొన్నారు.




# బాంబ్ బ్లాస్టింగ్‌తో భయాందోళనలు





**భిక్కనూర్ జనవరి 24 (ప్రజా జ్యోతి)**

భిక్కనూర్ మండల కేంద్రంలోని ఈసన్నపల్లి గ్రామ శివారులో ఉన్న గుట్టను దాదాపుగా గత 20 సంవత్సరాల నుండి యదేచ్ఛగా ప్రభుత్వా అనుమతులు లేకుండా ప్రభుత్వానికి ఎలాంటి సినారేజీ చెల్లించకుండా ఇష్టారీతిన అడిగేవారే లేరు అనే రీతిలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గుట్టను ధ్వంసం చేస్తున్నారు. వీరిపై శాఖ పరమైన చర్యలు తప్పవా ఎందుకోసం తీసుకోవడం లేదు రాజకీయ లబ్ధి కోసమేనా లేక అధికారులు అండదండలతోనా అనే అనుమానాలు గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా బాధితులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ గుట్టపై తవ్వకాలు జరుపుతున్న దళారులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు ఇకనైనా ప్రభుత్వం దృష్టి పెట్టి బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నారు అదేవిధంగా ఈ యొక్క గుట్ట ధ్వంసం చేయడం వలన సుమారు15 వ్యవసాయం బోరు మోటార్ లు ఫెయిల్ అయ్యాయి. ఆ గుట్టకు పెట్టే బాంబ్ బ్లాస్ట్ వలన భూగర్భంలోని అంతర్గజాలం బోర్ మోటార్లపై ప్రభావం వలన బోరు మోటార్ లు మూసిపోయాయి. లబోది ఇవ్వమంటున్న బాధితులు అదేవిధంగా ఇదే గ్రామానికి చెందిన గతంలో బాధితుడు తిరుమల్ స్వామి అనే ఒక వ్యక్తి చనిపోయే పరిస్థితి దాపురించిన సందర్భం. వర్షాకాలం యదేచ్ఛగా వర్షాలు కురిసిన చెరువులోకి మాత్రం చుక్కనీరు రాకుండా అడ్డుపడుతున్నారు. అని ఆరోపణలు? గ్రామం శివారులో ఉన్న ఆ గుట్టపై రహస్యంగా బాంబ్ బ్లాస్ట్ లు చేయడం వలన గుట్ట పగిలిపోయి రాళ్ల దెబ్బలు తగిలిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి? తదుపరి ఈ బాంబ్ బ్లాస్ట్ వలన గ్రామంలో ఒకసారిగా ఉలిక్కిపడడం అంతేకాకుండా నివాస గృహాలకు పగుళ్లు ఏర్పడడం, భయాందోళన గురిచేస్తుంది. కొన్ని సందర్భాలలో నివాస గృహాలు కూలిపోయే పరిస్థితిలో పెద్దపెద్ద శబ్దాలతో కూడిన బ్లాస్టింగ్ పనులను నిర్వహిస్తున్నారు. వీరిపై ప్రభుత్వం శాఖపారమైన చర్యలు తీసుకొని ఈ యొక్క కంకర మిషన్లను లాకౌట్ చేసి చుట్టుపక్కల గ్రామాలను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## శాంతియుత వాతావరణంలో

# రంజాన్ జరుపుకోవాలి

కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ రానున్న రంజాన్ పండుగను ప్రశాంతంగా, సుహృద్భావ వాతావరణంలో జరుపుకోవాలని, ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అధికారుల శాంతి కమిటీలు నిర్వహించిమసీదులు, ఈద్గాల వద్ద తగిన సౌకర్యాలు కల్పించాలని, భద్రత పర్యవేక్షించాలని,
శాంతిభద్రతల దృష్ట్యా రంజాన్ ప్రార్థనలు (నమాజ్), ఇఫ్తార్ విందులు సజావుగా సాగేలా శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చర్యలు తీసుకోవాలని, మసీదుల వద్ద విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం (క్లీన్లెన్స్) మెరుగుపరచాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.రంజాన్ మాసంలో నిబంధనల ప్రకారం ఏర్పాట్లు, ఇఫ్తార్ విందుల నిర్వహణకు మత పెద్దల సహకారం ,రంజాన్ మాసంలో షాపులు, వ్యాపార సముదాయాలు 24 గంటలు తెరిచి ఉంచేందుకు , రంజాన్ నెలంతా ఆధ్యాత్మిక చైతన్యం, క్రమశిక్షణతో కూడిన దీక్షలతో ముస్లిం సోదరీ సోదరులు ఉపవాసాలు పాటిస్తారని ఈ సందర్భంగా అవసరమైన ఏర్పాట్లు చేసి ప్రశాంత వాతావరణం లో శాంతియుతంగా పండుగను జరుపుకోవాలని అన్నారు.
ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ మధుమోహన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి,ఆర్డిఓ వీణ, మత పెద్దలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## పదోన్నతులు పోలీసుల్లో

# బాధ్యతను పెంచుతాయి

కామారెడ్డి ప్రతినిధి జనవరి 24. (ప్రజాజ్యోతి)

పోలీసు శాఖలో పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతాయని, రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందించాలని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర పేర్కొన్నారు. సదాశివనగర్ పోలీస్ స్టేషన్?లో హెడ్ కానిస్టేబుల్?గా విధులు నిర్వహిస్తూ ఏఎస్సై గా పదోన్నతి పొందిన డి. దేవరాజు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆయనకు పదోన్నతి చిహ్నాలను అలంకరించి, శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ: "పోలీసు వ్యవస్థలో క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేసే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, గౌరవం లభిస్తాయి. పదోన్నతులు కేవలం హోదా మార్పు మాత్రమే కాదు, అది విధి నిర్వహణలో బాధ్యతను మరింత పెంచుతుంది. పదోన్నతి పొందిన సిబ్బంది తమ జీవనశైలిని మెరుగుపరుచుకుంటూ, ప్రజలకు మరింత చేరువగా ఉండి నిజాయితీతో సేవలు అందించాలి." అని సూచించారు.

# సమ్మక్క--సారక్క గుడి భక్తులకు అన్నదాన సహాయం

**గాడ్కోల్ సర్పంచ్ లత శంకర్ నుంచి నగదు, బియ్యం విరాళం**

**నిజాంబాద్ రూరల్: జనవరి, 24 (ప్రజా జ్యోతి)**

సిరికొండ మండలంలోని ముసిర్ నగర్ గ్రామానికి చెందిన సమ్మక్క--సారక్క గుడి భక్తులకు గాడ్కోల్ గ్రామ సర్పంచ్ సంద్ర లత శంకర్ ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా రూ.2,100 నగదుతో పాటు 50 కిలోల బియ్యాన్ని భక్తులకు విరాళంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంపత్ రెడ్డి, వార్డు సభ్యులు హేమంత్ బీ, గంగాధర్, సలీం, గంగారాం, రాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొని సహకరించారు. పలువురు భక్తులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.భక్తుల సేవే లక్ష్యంగా ఈ సహాయం అందించామని గ్రామ ప్రతినిధులు తెలిపారు.



# గ్రామ సంఘాల బలోపేతానికి వివోఏలు కృషి చేయాలి.

## ఏ.పి.ఎం ప్రసాద్

**సదాశివనగర్ జనవరి 24 (ప్రజాజ్యోతి)**

సదాశివనగర్ మండలంలోని గ్రామ సంఘాల బలోపేతానికి వివోఏలు కృషి చేయాలన్నారు. శనివారం స్థానిక రైతు వేదికలో వివో ఎల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సమైక్య అధ్యక్షురాలు బాలం బాయ్ మాట్లాడుతూ.. ఇందిరా మహిళా మహిళా శక్తి కార్యక్రమంలో నిర్దేశించిన టార్గెట్లను ఈ నెలాఖరులోపు ప్రగతి సాధించాలని వివో ఏ లను కోరారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏపీఎం ప్రసాద్ మాట్లాడుతూ.. సోషల్ మొబిలైజేషన్ కార్యక్రమం క్రింద ప్రతి గ్రామ సంఘంలో వికలాంగుల సంఘం, వృద్ధుల సంఘం, కిషోర్ బాలికల సంఘం సంఘాల్లో లేని మహిళలను స్వయం సహాయక సంఘాల్లో చేర్పించాలని వివో ఏ లను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన శ్రీనిధి టార్గెట్ ను 100% ప్రగతి సాధించడం సంతోషకరమన్నారు. బ్యాంకు లింకేజ్ నాటు కోళ్ల గొర్రెల పెంపకం యూనిట్లను జనవరి 31 లోపు పూర్తిచేయాలని అన్నారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా నిరక్షరాశులను అక్షరాసులుగా తీర్చిదిద్దాలని కోరారు.




గ్రామస్థాయిలో నిరుపేదలను గుర్తించి వారికోసం గుప్పెడు బియ్యం పథకాన్ని అమలు చేయాలని సూచించారు. గ్రామ సంఘాల్లోని పేరుకపోయిన మొండి బకాయిలను గ్రామస్థాయి రికవరీ కమిటీ ద్వారా ఫిబ్రవరి నెలలోపు రికవరీ పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సీసీలు అంజా గౌడ్, ప్రతాప్, అంజయ్య, రాజు, భూమయ్య, నరేందర్ రెడ్డి, ఎస్ ఎన్ మేనేజర్ నవీన్, వివోఏలు పాల్గొన్నారు.

# క్షీరసాగర డైరీ ఫామ్ ప్రారంభోత్సవం



## కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి

**బీబీపేట్ మండల్ ప్రజా జ్యోతి జనవరి 24**

బీబీపేట మండల కేంద్రంలో డ్వాక్రా మహిళలకు ఇచ్చిన రుణాల ద్వారా 14 మంది సభ్యులు ఒక్కొక్కరు 1.5 లక్షల రూపాయలతో కలిపి, 21 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసుకున్న క్షీర సాగరం డైరీ ఫామ్ - గొర్ల పెంపకం (80 గొర్లు, మేకలు), 8 గేదెలు మరియు 2 ఆవుల ద్వారా పాల ఉత్పత్తి కేంద్రం, ఫ్లోరి కల్చర్ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాలను కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా శాసన సభ్యులు కాటిపల్లి వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చే వడ్డీ లేని రుణాలను మహిళలు తీసుకొని పాడి పరిశ్రమలు మరియు వివిధ రంగాలలో అభివృద్ధి చెందాలని ఆయన కోరారు. మహిళా శక్తి దేశ శక్తి గా మహిళలు అభివృద్ధి చెంది దేశాన్ని అభివృద్ధి చెందేలా చూడాలని రమణారెడ్డి వివరించారు. ఇట్టి కార్యక్రమంలో బీబీపేట సర్పంచ్ ఏదుల్ల సాత్విక సాయినాథ్ గారు, శ్రీనిధి రాష్ట్ర కోశాధికారి సదాల స్రవంతి, పరిశోదక విద్యార్థి డా, సంతోష్ గౌడ్ ఐకేపీ డీపీఎం సురేష్ బాబు, ఏపీఎం శ్రీనివాస్, ఐకేపీ సీసీలు, కోనాపూర్ సర్పంచ్ చెప్యాల రాజేష్, ఉప్పసర్పంచ్ గరిగే శేఖర్, బీజేపీ నాయకులు పోసు శివ కుమార్, సూరు సురేష్, బట్టుపల్లి రంజిత్, బట్టుపల్లి రాములు, ఉప్పు నారాయణ, బట్టు భరత్, బిజెపి నాయకులు, పుర ప్రముఖులు గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# నేర నిరోధానికి సిసి కెమెరాలు రక్షణ కవచాలు

**- దోమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబర్పేట్ గ్రామంలో 18 నూతన సిసి కెమెరాలను ప్రారంభించిన ఏఎస్పీ**

**- కామారెడ్డి ఏఎస్పి బి చైతన్య రెడ్డి**

**కామారెడ్డి ప్రతినిధి జనవరి 24. (ప్రజాజ్యోతి)**

ప్రజా భద్రత మరియు నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కామారెడ్డి ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి తెలిపారు. శనివారం దోమకొండ మండలం అంబర్పేట్ గ్రామంలో, కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం కింద ఏర్పాటు చేసిన 18 నూతన సీసీ కెమెరాలను ఏఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి మాట్లాడుతూ: నేరాలను ముందుగానే అరికట్టడానికి సిసి కెమెరాలు ఒక ప్రభావవంతమైన సాధనమని, దొంగతనాలు, చైన్ స్నాచింగ్ మరియు వాహనాల దొంగతనాల నివారణలో ఇవి ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. ప్రజా భద్రత కోసం గ్రామస్తుల సహకారంతో ఇలాంటి నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడం స్ఫూర్తిదాయకమని ఏఎస్పి అభినందించారు. ఏదైనా నేరం జరిగినప్పుడు సిసి కెమెరా ఫుటేజీ ద్వారా నిందితులను సులభంగా మరియు త్వరగా గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అంబర్పేట్ గ్రామం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోందని, ప్రతి గ్రామంలోనూ ఇలాంటి సిసి కెమెరాలను ఏర్పాటు చేసి నేర నిరోధంలో పోలీసు యంత్రాంగానికి తోడ్పాటు అందించాలని ఏఎస్పి కోరారు. ఈ కార్యక్రమంలో భిక్నూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సంపత్ కుమార్, దోమకొండ ఎస్సై ప్రభాకర్, ఎంపీడీఓ, గ్రామ సర్పంచ్, ఉప



సర్పంచ్, 12 మంది వార్డ్ మెంబర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## పండరిపూర్‌కు పాదయాత్ర

**సర్వపూర్ నుంచి దిండి పండరి పూర్ ఘనంగా కొనసాగుతున్న మహా పాదయాత్ర**

**బాన్సువాడ ఆర్ సి, జనవరి 24 (ప్రజా జ్యోతి):**



గాంధారి మండలంలోని సర్వపూర్ గ్రామం నుంచి పండరిపూర్?కు ఉద్దేశించి ప్రారంభమైన మహా పాదయాత్ర పదో రోజుకు చేరుకుని భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. ఈ నెల 14వ తేదీన సర్వపూర్ నుంచి పాదయాత్రగా బయలుదేరిన భక్తులు దిండి వరకు చేరుకున్నారు. పండరిపూర్ మహా పాదయాత్రలో సంగోజిపేట్ గ్రామానికి చెందిన యువకులు శ్రీకాంత్, సంజువ్ రావు, అంజ గౌడ్, ప్రశాంత్, ఇప్పల అంజయ్యతో పాటు భజన మండలి సభ్యులు పాల్గొన్నారు. మొత్తం సుమారు 250 మంది భక్తులు ఈ పాదయాత్రలో భాగస్వాములై విఠలేశ్వరుడి నామస్మరణతో మార్గమంతా భజనలు చేస్తూ ముందుకు సాగుతున్నారు. భక్తుల నిబద్ధత, ఐక్యత ఈ పాదయాత్రలో స్పష్టంగా కనిపిస్తోందని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. పండరిపూర్ విఠలుని దర్శించుకోవాలనే సంకల్పంతో సాగుతున్న ఈ పాదయాత్ర విజయవంతంగా పూర్తవాలని వారు ఆకాంక్షించారు.

## దివ్యాంగులకు ఎలక్ట్రిక్ సైకిళ్ల పంపిణీ



**బీబీపేట్ మండల్ ప్రజా జ్యోతి జనవరి 24**

బీబీపేట మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆవరణలో దివ్యాంగులకు ఎలక్ట్రిక్ సైకిల్ లను గ్రామ సర్పంచ్ ఎదుల్ల సాత్విక సాయి పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ సాత్విక మాట్లాడుతూ గ్రామంలో నడవలేని దివ్యాంగులకు ఆర్టిఫిసియల్ లింబ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ నుండి ఎలక్ట్రిక్ సైకిల్ లను తెప్పించి ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇలా ఇంకా ఎవరికైనా అవసరం ఉంటే తన దృష్టికి తెస్తే వారికి కూడా తెప్పించి ఇప్పిస్తానని తెలిపారు. అనంతరం లబ్ధి పొందిన మహిళలు సర్పంచ్ సాత్వికకు ధన్యవాదాలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో సర్పంచ్ ఎదుల్ల సాత్విక సాయి, ఉప సర్పంచ్ చందుపట్ల ప్రశాంత్, కార్యదర్శి రమేష్ కుమార్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సెంటర్లలో ప్లేట్ల పంపిణీ

**బీబీపేట్ మండల్ ప్రజా జ్యోతి జనవరి 24**

బీబీపేట మండలంలోనీ యాడవరం గ్రామంలో గ్రామ సర్పంచ్ గొబ్బూరు సుధారాణి బాపురెడ్డి అంగన్వాడి సెంటర్లలో ప్లేట్ల ను పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ సుధారాణి మాట్లాడుతూ అంగన్వాడి సెంటర్లలో చిన్నపిల్లలకు తినడానికి ప్లేట్లు లేకపోవడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారని వారికి ప్లేట్లను ఇవ్వడం జరిగిందని తెలిపారు. అంగన్వాడి మేడంలు, ఆయాలు పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారిని చూసుకోవాలని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో సర్పంచ్ గొబ్బూరు సుధారాణి బాపురెడ్డి, వార్డు సభ్యులు కొత్తపల్లి భాస్కర్, సుజాత, సులోచన, రమేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ చైర్మన్ బరిలో త్రిమూర్తులు

## పాతవారికంటే కొత్తవారికే అవకాశం
## మున్సిపల్ చైర్మన్ కుర్చీ బాదుషా ఎవరో







**బాన్సువాడ ఆర్‌సి, జనవరి 24 (ప్రజా జ్యోతి):**
బాన్సువాడ పట్టణంలో మున్సిపల్ చైర్మన్ పదవికి సంబంధించి రాజకీయ వాతావరణం రోజు రోజుకు ఆసక్తికరంగా మారుతోంది. ఈసారి ఎన్నికల్లో గతంలో పదవులు అనుభవించిన పాత నాయకుల కంటే యువత, కొత్తదనాన్ని కోరుకుంటూ కొత్త ముఖాలకే అవకాశం ఇవ్వాలన్న చర్చ పట్టణంలో జోరుగా సాగుతోంది. మున్సిపల్ చైర్మన్ బరిలో నిలిచిన ముగ్గురు నాయకులు ప్రజల మధ్య మంచి ఆదరణ కలిగి ఉండడం, వారంతా ఒకే పార్టీకి చెందినవారే కావడం రాజకీయంగా విశేషంగా మారింది. ఎవరు చైర్మన్ కుర్చీని అధిష్టిస్తారన్న అంశంపై పట్టణమంతా ఉత్కంఠ నెలకొంది. పాత రాజకీయాలకు విరక్తి చెంది, అభివృద్ధి దృష్టితో పనిచేసే కొత్త నాయకత్వం అవసరమని ఓటర్లు భావిస్తున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా యువ నాయకుడికి అవకాశం ఇస్తే బాన్సువాడ పట్టణ అభివృద్ధితో పాటు కాంగ్రెస్ పార్టీ జెండా పట్టణంలో ఖచ్చితంగా ఎగరవేయడం ఖాయమని స్థానికులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.
మొత్తంగా ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో మార్పు తప్పదన్న అభిప్రాయం ప్రజల్లో బలంగా వినిపిస్తోంది. మున్సిపల్ చైర్మన్ కుర్చీని చివరకు ఎవరు దక్కించుకుంటారన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది.

# ఫిబ్రవరిలో సర్పంచ్ ఫోరం ఎన్నిక



**బిక్కనూరు, జనవరి 24 (ప్రజాజ్యోతి)**
భిక్కనూరు మండలంలోని నూతన పాలకవర్గ సర్పంచులు జనవరి 23 తో శిక్షణా తరగతులు పూర్తిచేసుకుని, 24న సమావేశమై ఫిబ్రవరి నెలలో సర్పంచుల ఫోరం అధ్యక్షున్ని ఎన్నుకోవడం జరుగుతుందని, అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, జనరల్ సెక్రటరీలను ఖరారు చేయడం జరుగుతుందని ఈ సమావేశంలో తెలిపారు.

# అభివృద్ధి పనులను చూసి నాయకున్ని ఎన్నుకోవాలి: పోచారం కాసుల





**బాన్సువాడ ఆర్ సి జనవరి 24( ప్రజా జ్యోతి)**
బాన్సువాడ పట్టణంలోని 02 మరియు 14 వ వార్డులో పర్యటించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి , రాష్ట్ర ఆగ్రోస్ చైర్మెన్ కాసుల బాలరాజు లు పర్యటించి అభివృద్ధి పనుల గురించి వివరించారు అనంతరం వారు మాట్లాడుతూ అభివృద్ధి చేసే నాయకున్ని ఓటు వేసి ఎన్నుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో 2 వ వార్డు, 14 వ వార్డు ప్రజలతో గత 5 సంవత్సరాలలో జరిగిన అభివృద్ధి పనులను తెలియచేశారు, రానున్న మున్సిపాలిటి ఎన్నికల్లో బాధ్యతతో పనిచేసే వారిని ఎన్నుకుంటే మన వార్డులు మరింత అభివృద్ధి చేసుకోవచ్చు అని తెలిపారు ఈ కార్యక్రమంలో బాన్సువాడ పట్టణ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

## ఎంపీడీవో తాహేరా బేగం



**ఎల్లారెడ్డి, జనవరి -24 (ప్రజా జ్యోతి)**
ఎల్లారెడ్డి మండలంలోని మల్లాయిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ తాహెరా బేగం అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణాలను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలన్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి సాదించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని సూచించారు. లబ్ధిదారులతో మాట్లాడి పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, ఎంపీఓ ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టాన్ని నీరుగారిస్తే ఊరుకోం

-- బిపిఎల్ దిగువ ఉన్నవారికి పెద్దవరం
-- కనీస వసతులు లేని పేదవారికి ఉపాధి మార్గం
-- 100 రోజుల పని దినాలని 60 రోజులకు కుదింపుకు కేంద్రం కుట్ర
-- కుట్రలో భాగంగా పథకం పేరు మార్పు




**భిక్కనూరు, జనవరి 24 (ప్రజాజ్యోతి)**
ఉపాధి లేక వలసలు వెళుతున్న గ్రామీణ ప్రజలకు, ఎటువంటి నైపుణ్యం లేని పేదవారికి ఉపాధి హామీ పథకం ఒక వరం. ఇంతటి అద్భుతమైన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం పేరు మార్చడాన్ని వ్యతిరేకిస్తూ, కామారెడ్డి జిల్లా బిక్కనూరు మండల కేంద్రంలో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో,భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి,నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ నేషనల్ మహిళా సెక్రటరీ మయూరిసింగ్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుమితారావు హాజరయ్యారు. వీరు మాట్లాడుతూ... మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం "వికాసిత్ భారత్ గ్యారంటీ" పేరిట మార్పు చేస్తూ, 100 రోజుల ఉపాధి నీ 60 రోజులకు కుదించడంతో, కూలీ లేక పేద మధ్యతరగతి వారు తీవ్ర నష్టం వాటిల్లుతోందని వారు మండిపడ్డారు. ప్రజలకు ఉపయోగపడే పథకం అయితే సరిపోతుంది పేర్ల మార్పుతో పని దినాలకు కుదింపుతో పేదల పొట్ట కొట్టడం ఎంతవరకు సమంజసం అని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్ఞానేశ్వరి,మండల అధ్యక్షురాలు బల్యాల రేఖ తోపాటు నియోజకవర్గంలోని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# ప్రభుత్వ కార్యాలయాల్లో అంబేద్కర్ ఫోటో పెట్టి జెండా ఎగర వేయాలి

## జిల్లా అధ్యక్షుడు గంగారాం



**కామారెడ్డి టౌన్ జనవరి 24 (ప్రజా జ్యోతి)**
తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు కొత్తోల గంగారాం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో ఏవో ను కలిసి వినతి పత్రం అందజేశారు. గంగారం మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం సంధర్భంగా ప్రతి పాఠశాలలో , కళాశాలలో ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో భారత రత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్ర పటం పెట్టీ గణతంత్ర దినోత్సవం జెండా ఆవిష్కరణ చేయాలని కోరారు. గణతంత్ర దినోత్సవం రోజున చాలా చోట్ల బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్ర పటం పెట్టడం లేదు అని అలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కొత్తొల గంగారాం జిల్లా గౌరవ అధ్యక్షులు కొత్తపల్లి మల్లన్న జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు సాప శివరాములు, ఆర్టీఐ రాష్ట్ర కార్యదర్శి లేగ్గేల రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బాలికల దినోత్సవం

**సదాశివనగర్ జనవరి 24 (ప్రజాజ్యోతి)**
తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కామారెడ్డి (మర్కల్ ) నందు జాతీయ బాలిక దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బి. ఏ. నుండి ఎస్.సాయి తేజ, పవర్ పాయింట్ ప్రెసెంటేషన్, టి.అరుణ, ఎం మల్లికలు పోస్టర్ ప్రెసెంటేషన్ ల ద్వారా బాలికల కోసం ఉన్న హక్కులు, ప్రభుత్వ పథకాలు, అన్ని రంగాల్లో బాలికలు సాధిస్తున్న విజయాల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎస్. కృష్ణవేణి, మహిళా సాధికారత సెల్ కో ఆర్డినేటర్ సి. కృష్ణవేణి, ఆర్ట్స్ విభాగానికి చెందిన మౌనిక, షారోన్, యువరాణి తో పాటు అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు



# యువత క్రీడల్లో రాణించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

## ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్






**కామారెడ్డి టౌన్ జనవరి 24( ప్రజా జ్యోతి)**
యువత చదువుతో పాటు క్రీడల్లోనూ ఉత్సాహంగా పాల్గొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు.శనివారం కామారెడ్డిలోని బ్యాడ్మింటన్ అకాడమీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అకాడమీలోని సౌకర్యాలను పరిశీలించి, క్రీడాకారులతో ముచ్చటించారు.?శారీరక శ్రమ అవసరం ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై దృష్టి సారించాలని కోరారు.సమయం దొరికినప్పుడల్లా క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని పేర్కొన్నారు.?దైనందిన జీవితంలో వ్యాయామం: కేవలం క్రీడలే కాకుండా, ప్రతిరోజూ వ్యాయామం, వాకింగ్, మరియు జాగింగ్ వంటివి అలవాటు చేసుకోవాలని సూచించారు. ఇవి మనల్ని అనారోగ్యాల బారి నుండి రక్షించి, ఆరోగ్యంగా ఉంచుతాయని ఆయన వివరించారు.యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, క్రీడలను కెరీర్?గా లేదా అభిరుచిగా ఎంచుకోవాలని, తద్వారా క్రమశిక్షణ అలవడుతుందని తెలిపారు.?క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం
?రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు మరియు క్రీడాకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, గ్రామీణ స్థాయిలోని ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. అకాడమీలోని క్రీడాకారుల ఉత్సాహాన్ని చూసి ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో వారు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అకాడమీ నిర్వాహకులు, స్థానిక నాయకులు మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.

# రేడియో హౌస్ ను సందర్శించిన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్

**కామారెడ్డి ప్రతినిధి జనవరి 24. (ప్రజాజ్యోతి)**
పట్టణంలోని లిటిల్ స్కాలర్ స్కూల్?లో ఏర్పాటు చేసిన రేడియో హౌస్?ను ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ శనివారం సందర్శించారు.
ఈ సందర్భంగా రేడియో హౌస్?లోని విద్యార్థులు నిర్వహించిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పాల్గొని, విద్యార్థులకు ప్రోత్సాహకరమైన సందేశాలు అందించారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూవిద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, మాట్లాడే నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించడంలో ఇలాంటి రేడియో హౌస్ కార్యక్రమాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు.పుస్తకాల చదువుతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ కూడా అవసరమని, చిన్న వయసులోనే మీడియా పరిజ్ఞానం అలవర్చుకోవడం భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.లిటిల్ స్కాలర్ స్కూల్?లో విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం యాజమాన్యం, ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశంసించారు.ఈ దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో కష్టపడి చదవాలని విద్యార్థులకు ఆయన సూచించారు.
చివరిగా విద్యార్థులను ఆయన ఆత్మీయంగా అభినందించి, ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.




# గర్గుల్--ఇస్రోజీవాడి గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల తనిఖీ

## సేవలపై సంతృప్తి వ్యక్తం చేసిన సూపర్వైజర్ పద్మజ





**కామారెడ్డి రూరల్ జనవరి 24 ప్రజా జ్యోతి**
కామారెడ్డి మండలం గర్గుల్, ఇస్రోజీవాడి గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను సూపర్వైజర్ పద్మజ విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న పోషకాహారం, ప్రీ--ప్రైమరీ విద్య, ఆరోగ్య సేవలు, గర్భిణీ మహిళలు మరియు బాలింతలకు అందుతున్న సదుపాయాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న ఐసీడీఎస్ పథకం కింద అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలు గ్రామస్థాయిలో సక్రమంగా అమలవుతున్నాయా లేదా అనే అంశంపై సూపర్వైజర్ ప్రత్యేక దృష్టి సారించారు. పిల్లల బరువు, ఎత్తు నమోదు రికార్డులు, హాజరు పట్టికలు, పోషకాహార పంపిణీ వివరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, అందువల్ల సిబ్బంది అంకితభావంతో పని చేయాలని సూపర్వైజర్ పద్మజ సూచించారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలు తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాలను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది కృప, భాగ్యలక్ష్మి, సంజీవని అంజలి పాల్గొని తమ కేంద్రాల్లో చేపడుతున్న కార్యకలాపాలను వివరించారు. అలాగే గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమానికి మద్దతు తెలిపారు.
గ్రామాల్లో అంగన్వాడీ సేవలు మరింత బలోపేతం కావాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమని, పిల్లల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ భాగస్వాములుగా మారాలని సూపర్వైజర్ ఈ సందర్భంగా పిలుపునిచ్చార

# పలు పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందజేసిన యువ నాయకుడు



**ఎల్లారెడ్డి, జనవరి-24(ప్రజా జ్యోతి )**
ఎల్లారెడ్డి మండలంలోని వివిధ అజామాబాద్, తిమ్మారెడ్డి, అన్నసాగర్, తిమారెడ్డి తండా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ జనవరి 26 గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆట పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి పాఠశాలలో 100 శాతం హాజరైన వారికి అన్న సాగర్ గ్రామానికి చెందిన యువకుడు నరేష్ పీకే విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తన సొంత ఖర్చులతో యువ నాయకుడు నరేష్ బహుమతులను ఉపాధ్యాయ బృందానికి అందజేయడం జరిగిందని అన్నారు. అన్నాసాగర్ లోని రెండు అంగన్వాడీ సెంటర్లకు ,అలాగే అజామాబాదులో కల అంగన్వాడి సెంటర్ కు బహుమతులు అందజేయడం జరిగిందని తెలిపారు. అనంతరం నరేష్ పీకేకు పలు పాఠశాలల ఉపాధ్యాయులు గ్రామస్తులు అభినందించారు.

# కాంగ్రెస్ పార్టీ టికెట్ అప్లికేషన్ ఫామ్ అందజేసిన మాజీ జడ్పీటీసీ



**ఎల్లారెడ్డి, జనవరి-24(ప్రజా జ్యోతి)**
త్వరలో జరగనున్న ఎల్లారెడ్డి మున్సిపాలిటీ ఎన్నికల్లో 6వ వార్డు కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా టికెట్ ఇవ్వాలని ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వినోద్ గౌడ్ కు అప్లికేషన్ ఫామ్ ను మాజీ జెడ్పిటిసి షేక్ గయాజుద్దీన్ అందజేశారు. ఈ సందర్భంగా షేక్ గయాజుద్దీన్ మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ తరఫున టికెట్ ఇస్తే ఈసారి భారీ మెజారిటీతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు గౌరవించి శనివారం అప్లికేషన్ ఫామ్ ను పట్టణ అధ్యక్షునికి అందజేశానని తెలిపారు. పదవి ఉన్నా..లేకున్నా ఎల్లప్పుడూ ఎల్లారెడ్డి ప్రజలతోనే తన జీవితమని తెలిపారు. ఎంతో ఆదరించి.. అభిమానించే ఎల్లారెడ్డి ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు.. కాంగ్రెస్ పార్టీ నుంచి తనికె టికెట్ ఇస్తే ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆశీర్వాదంతో ఈసారి భారీ మెజార్టీ రావడానికి కృషి చేస్తానని తెలిపారు. పేద ప్రజల అభివృద్ధే నా ధ్యేయమని.. నిస్వార్థ రాజకీయంతో ఎల్లారెడ్డి ప్రజలకు సేవ చేయడమే నా సంకల్పమని తెలిపారు.

# నూతన బోరు మోటర్ ప్రారంభం

**రామారెడ్డి జనవరి 24 (ప్రజాజ్యోతి)**
రామారెడ్డి మండల కేంద్రంలోని 14 వ వార్డులో నీటి సమస్య ఉండడం వలన నూతన గ్రామ సర్పంచ్ బండి ప్రవీణ్ ఉప సర్పంచ్ నవీన్ ఆధ్వర్యంలో నూతన బోరు మోటర్ ను బిగించడం జరిగింది. ఈ విషయంపై 14 వ వార్డు సభ్యులు హర్ష వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ రావు ఫ్, కాంగ్రెస్ కోఆర్డినేటర్ రంగు రవీందర్ గౌడ్, 14వ వార్డు మెంబర్ శేఖర్ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

## -ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్






**నాగిరెడ్డిపేట్,జనవరి24(ప్రజాజ్యోతి);**
ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ అన్నారు.శనివారం నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను నాగిరెడ్డిపేట సర్పంచ్ మన్నే వెంకటి,మహిళ పంచాయతి కార్యదర్శులతో కలిసి తనిఖీ చేశారు.ఈ సందర్బంగా పాఠశాలలోని ఉపాధ్యాయులు ఎలాంటి సెలవు పెట్టకుండా విధులకు గైర్హాజరవ్వడం సరైంది కాదని,విధులకు హాజరు కానీ ఉపాధ్యాయులు ఫోన్ మెసేజ్ లు కాకుండా రాతపూర్వకంగా సెలవు పత్రం రాసి ఇవ్వాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.విధులకు హాజరు కానీ ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేయాలని ప్రిన్సిపాల్ గీతను ఎంపీడీవో ఆదేశించారు.ఈ విషయమై జిల్లా కోఆర్డినేటర్ అధికారిణి సుకన్య పాఠశాల పరిస్థితులను ఎంపీడీవో వివరించారు.విధులకు హాజరు కానీ ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పాఠశాలలో 214 మంది విద్యార్థులకు గాను కేవలం 120 మంది విద్యార్థులు ఉన్నారని మొత్తం విద్యార్థులు పాఠశాలలో చేరేవిదంగా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్ గీతను కోరారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందడంలేదని తన దృష్టికి వచ్చిందని,మెనూ ప్రకారం భోజనం అందించాలని వంట ఏజెన్సీలకు సూచించారు. ఆయన వెంట నాగిరెడ్డిపేట్ గ్రామా సర్పంచ్ మన్నే వెంకటి,పంచాయతి కార్యదర్శులు మమత, వనజ అనిత ఉన్నారు.

# నాగిరెడ్డిపేట్ లో చిరుతపులి సంచారం కలకలం



## -భయాందోళనలో చుట్టుప్రక్కల గ్రామస్తులు...

**నాగిరెడ్డిపేట్, జనవరి24(ప్రజాజ్యోతి);**
నాగిరెడ్డిపేట్ మండలంలో ?ధర్మారెడ్డి అటవీ ప్రాంతంలో చిరుత సంచారం కలకలం రేపింది. శనివారం ఉదయం గంటలకు తాండూర్ గేట్ సమీపంలోని కోళ్ల ఫారం నుంచి జాతీయ రహదారిని దాటుకొని ధర్మారెడ్డి అటవీ ప్రాంతంలో వెళ్లడం స్థానికులు కనిపించింది. దింతో ధర్మారెడ్డి అటవీలోకి చిరుత వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని స్థానికులు నాగిరెడ్డిపేట్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అటవీ శాఖ అధికారులకు సమాచారాన్ని అందజేశారు.అట?వీ శాఖ రెంజ్ అధికారి వాసుదేవ్ రావు తన సిబ్బందితో కలిసి తాండూర్ సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లి ఆ ప్రాంతంలో సోదాలు నిర్వహించి, లభ్యమైన పాదముద్రలను,విసర్జితంను పరిశీలించారు.అవి చిరుత పులి అడుగులేనని అధికారులు అధికారికంగా ధృవీకరించారు.అటవీ ప్రాంత సమీపంలోని గ్రామాలు బంజారా తండా,తాండూర్,లింగంపల్లి కలాన్,ధర్మారెడ్డి గ్రామాల్లో ప్రజలతో పాటు,పొలాలకు వెళ్లే రైతులు,పశువుల కాపరులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని , రాత్రి వేళల్లో ఒంటరిగా బయటకు రావద్దని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు.



# ఇస్రోజీవాడికి పర్మినెంట్ విద్యుత్ అధికారులు నియమించాలి

## గ్రామ సర్పంచ్ చిందం మల్లేష్

కామారెడ్డి రూరల్ జనవరి 24 ప్రజా జ్యోతి
కామారెడ్డి మండలం, ఇస్రోజీవాడి గ్రామానికి శాశ్వతంగా విద్యుత్ శాఖ అధికారులు ఏఎల్?ఎం, జేఎల్?ఎంలను నియమించాలని గ్రామ సర్పంచ్ చిందం మల్లేష్, ఉపసర్పంచ్ సిద్ధం స్వామి, పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం ఒక్కో విద్యుత్ ఉద్యోగికి నాలుగు నుంచి ఐదు గ్రామాల బాధ్యతలు అప్పగించడంతో ప్రతి గ్రామానికి సకాలంలో సేవలు అందడం లేదని వారు తెలిపారు. చిన్నపాటి విద్యుత్ లోపాలు వచ్చినా సిబ్బంది వెంటనే అందుబాటులో లేకపోవడంతో రైతులు, గృహ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ఫ్యూజ్ కాలిపోవడం, ట్రాన్స్?ఫార్మర్ సమస్యలు తలెత్తిన సమయంలో అధికారుల ఆలస్యం కావడం వల్ల వ్యవసాయ పనులు నిలిచిపోతున్నాయని, గ్రామ ప్రజలకు ఆర్థిక నష్టాలు జరుగుతున్నాయని సర్పంచ్ చిందం మల్లేష్ అన్నారు.ఇస్రోజీవాడి గ్రామంలో జనాభా, వ్యవసాయ భూములు అధికంగా ఉండటంతో పాటు విద్యుత్ వినియోగం కూడా ఎక్కువగా ఉందని, ఇలాంటి పరిస్థితుల్లో పర్మినెంట్ ఏఎల్?ఎం, జేఎల్?ఎం నియామకం అత్యవసరం అని గ్రామ పాలకవర్గం డిమాండ్ చేసింది.ఈ విషయంపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే ఇస్రోజీవాడి గ్రామానికి శాశ్వత విద్యుత్ సిబ్బందిని నియమించి గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరారు కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారూ

# గణతంత్ర దినోత్సవ వేడుకలకు తాండూర్ వాసికి ఆహ్వానం...



నాగిరెడ్డిపేట్,జనవరి24(ప్రజాజ్యోతి):

దేశ రాజధాని ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలను తిలకించేందుకు కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్ గ్రామ వాసి కమ్మరి రాజుకు భారత ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందినట్లు ఆయన తెలిపారు.ప్రధాన మంత్రి శ్రమయోగి మందాన్ యోజన పథకంలో భాగంగా తెలంగాణ రాష్ట్రం నుంచి 7 గురు వ్యక్తులు ఈ వేడుకులను తిలకించేందుకు ఎంపిక చేసి ప్రభుత్వం ఆహ్వానించింది.ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి కమ్మరి రాజు ఎంపిక కాగా శనివారం భారత ప్రభుత్వ ఆహ్వానం మేరకు వీరు దేశ రాజధాని ఢిల్లీకి బయలుదేరారు.నేడు జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రాజు పాల్గొంటారు.గణతంత్ర వేడుకల్లో జెండా ఆవిస్కరణను తిలకించేందుకు తనకు అవకాశం రావడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నానని రాజు తెలిపారు.ఈమేరకు గ్రామస్థులు,ప్రజాప్రతినిధులు,రాజకీయ నాయకులు అబినందనలు తెలిపారు.

# అంగన్వాడి కేంద్రంలో ఈసీసీడే





**రామారెడ్డి జనవరి 23 (ప్రజా జ్యోతి)**
రామారెడ్డి మండల కేంద్రంలోని పలు సెంటర్లలో ప్రతినెల ఈసీసీ డే నిర్వహణతో పాటు జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా పిల్లలపై సంరక్షణ, అలవాట్లు, వర్ణమాల నేర్పించడం, మాటలు మాట్లాడించడం, పాటలు పాడించడం, స్థానికంగా పాఠశాలల్లో ఉన్న చిత్రపటాల పై అవగాహన కల్పించడం, వాటిని గుర్తించే విధంగా నైపుణ్యాన్ని వెలిగి తీయడం, ఆట వస్తువులను గుర్తించడం, శారీరకంగా ఆరోగ్యంగా ఉండేందుకు ఆటలు పాటలు పాడించడం తోపాటు అంగన్వాడికి వచ్చే పిల్లల తల్లిదండ్రుల సమక్షంలో సమావేశం ఏర్పాటు చేసి వాళ్ళ ఆధ్వర్యంలో పిల్లల బాగోగులు పరిశీలించడం, పౌష్టికాహారం పై అవగాహన కల్పించడం ఇలాంటి కార్యక్రమాలు ఈసీసీడే గ పరిగణించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలో పలు సెంటర్ల టీచర్లు, హెల్పర్, లు ముఖ్య అతిథులుగా 5 వార్డు మెంబర్ కోటూరి పద్మ , 13వ వార్డు మెంబర్ ఇసయిపేట్ హరీష్, చిన్నపిల్లల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ పతాక ఆవిష్కరణ ఆహ్వానం

## తాసిల్దార్ ఉమలత

**రామారెడ్డి జనవరి 24 (ప్రజా జ్యోతి)**
రామారెడ్డి మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయం నందు జాతీయ పతాకం జనవరి 26 పురస్కరించుకొని అధికారులు, అనధికారులు, రాజకీయ ప్రతినిధులు, గ్రామ సర్పంచులు, విద్యా, వైద్య, ఆరోగ్య శాఖలు, ఆయా గ్రామాల పాలకవర్గ సభ్యులు పాత్రికేయ మిత్రులు మండల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని జాతీయ పతాక ఆవిష్కరణ విజయవంతం చేయాలని తాసిల్దార్ ఉమలత తెలిపారు.

# విద్యుత్ శాఖ నిర్లక్ష్యం.. గుంతతో ప్రమాదాల ముప్పు

బాల్కొండ ఆర్ సి(ప్రజా జ్యోతి జనవరి 24



నిజామాబాద్ జిల్లాభీంగల్ మండలంలో కొత్త బస్టాండ్ వద్ద ప్రమాదంగా మారిన విద్యుత్ గుంతభీంగల్ మండల కేంద్రంలో కొత్త బస్టాండ్ డివైడర్ నిర్మాణం సమీపంలో విద్యుత్ సరఫరా కోసం తవ్విన గుంతను ఇప్పటివరకు పూర్చకపోవడంతో ప్రమాదకర పరిస్థితి నెలకొంది. రహదారి మధ్య భాగంలోనే గుంత ఉండటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రత్యేకంగా రాత్రి వేళల్లో గుంత స్పష్టంగా కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులు ఇప్పటికే పలుమార్లు చిన్నపాటి ప్రమాదాలు చోటుచేసుకున్నాయని వారు చెబుతున్నారు.కొత్త బస్టాండ్ ప్రాంతం కావడంతో రోజూ వందలాది మంది ప్రయాణికులు ఈ మార్గాన్ని ఉపయోగిస్తున్నారు. విద్యుత్ పనులు పూర్తయినప్పటికీ గుంతను పూడ్చకుండా నిర్లక్ష్యం చేయడం అధికారుల బాధ్యతారాహిత్యాన్ని సూచిస్తోందని ప్రజలు విమర్శిస్తున్నారు.సంబంధిత విద్యుత్ శాఖ, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి గుంతను పూర్చి రహదారిని సురక్షితంగా మార్చాలని, లేకపోతే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని తనిఖీ చేసిన డాక్టర్ అశోక్





ఇందల్వాయి( ప్రజా జ్యోతి న్యూస్ ) జనవరి. 24

ఇందల్వాయి మండల కేంద్రంలోని తిరుమల్ పల్లి ఉపకేంద్రాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అశోక్ ఆకస్మికంగా సందర్శించి చిన్న పిల్లలకి ఇచ్చే వ్యాక్సిన్ పట్ల జాగ్రత్తగా ఉండాలని ప్రతి గర్భిణీ స్త్రీకి శిశువుకు ఖచ్చితంగా వ్యాక్సిన్ చేరే విధంగా చూడాలని వైద్యాధికారికి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గల రిఫ్రిజిరేటర్ లోని ఐస్ ప్యాక్స్ ను పరిశీలించారు ఐ.ఎల్.ఆర్ యొక్క ఉష్ణోగ్రతను రిజిస్టర్లో వ్రాయాలని సిబ్బందికి సూచించారు. అటెండెన్స్ రిజిస్టర్ లో గల సిబ్బంది అందరూ సకాలంలో హాజరయ్యారా అని పరిశీలించారు సిబ్బంది సకాలంలో హాజరై పేద ప్రజలకు సేవలు అందించాలని తెలిపారు. ప్రతిరోజు ప్రతిరోజు సరైన వైద్యం అందజేస్తూ రోగుల సంఖ్య పెంచాలని ఆదేశించారు. ప్రతి బుధవారము,శనివారము తప్పకుండా ఆరోగ్య ఉప కేంద్రాలకు వ్యాక్సిన్ తీసుకువెళ్లి గర్భిణీ స్త్రీలకు శిశువులకు టీకాలు ఖచ్చితంగా ఇవ్వాలని ఆదేశించారు.అనంతరము తిరుమన్ పల్లి ఆరోగ్య ఉప కేంద్రానికి వెళ్లి టీకా కార్యక్రమంను పరిశీలించారు. టీకా కార్యక్రమంలో లబ్ధిదారుల పేర్లు రాయాలని స్థానిక ఆరోగ్య కార్యకర్త శారద కు సూచించారు. ప్రతి ఒక్క టీకా లబ్ధిదారుల పేర్లను యూ.విన్ యాప్ లో నమోదు అయ్యేవిధంగా చూడాలని డేటా ఎంట్రీ ఆపరేటర్ ఆనంద్ కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ క్రిస్టినా, జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ తరుణ్,ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ అలీ ఆరోగ్య కార్యకర్తలు శారద,భానుప్రియ ఆశా కార్యకర్తలు ప్రమీల, జ్యోతి పాల్గొన్నారు.

# ఎడపల్లిలో పబ్లిక్ ప్రాసిక్యూటర్, మండల అధికారులకు ఘన సన్మానం.

బోధన్ జనవరి 24 (ప్రజాజ్యోతి)



నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమం ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయవ్యవస్థ, పరిపాలనా యంత్రాంగం, మీడియా మధ్య ఉన్న సమన్వయాన్ని స్పష్టంగా ప్రతిబింబించింది. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో అప్ప కానున్ ఆర్టీఐ మీడియా యజమాని భుజంగ లింగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఐదవ అదనపు కోర్టు బోధన్ పబ్లిక్ ప్రాసిక్యూటర్?గా పదోన్నతి పొందిన ముస్కు గంగారెడ్డిని పాత్రికేయులు, ఆర్టీఐ ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గంగారెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు న్యాయ వ్యవస్థపై అవగాహన కల్పించడంలో ఆర్టీఐ చట్టం కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. సమాజంలో పారదర్శకత, జవాబుదారీతనం పెరగాలంటే పాత్రికేయుల సేవలు అత్యంత అవసరమని స్పష్టం చేశారు. మీడియా ప్రశ్నించే స్వభావమే ప్రజాస్వామ్యానికి బలమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీడీవో శంకర్ నాయక్, తహసిల్దార్ దత్తాద్రి, ఎంపీవో మన్మోహన్?లను కూడా సన్మానించడం విశేషంగా నిలిచింది. ప్రజలకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ సన్మానం నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు.న్యాయవాదులు, పాత్రికేయులు, ఆర్టీఐ నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మొత్తంగా ఈ కార్యక్రమం ప్రజా హితానికి న్యాయం--పరిపాలన--మీడియా కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని బలంగా చాటిచెప్పేదిగా నిలిచింది.

# నీటి ఎద్దడిని తీర్చిన సర్పంచ్

రెంజల్,జనవరి 24 (ప్రజాజ్యోతి ):

రెంజల్ మండల కేంద్రంలో గల 5వ వార్డులో గత కొన్ని రోజులుగా నీటి ఎద్దడి ఉందని కాలనీవాసులు సర్పంచ్ లలిత బుజ్జికి తెలపడంతో వెంటనే స్పందించిన సర్పంచ్ బోర్ మోటార్ ను రిపేర్ చేయించి కాలనీవాసులకు నీటి ఎద్దడిని తీర్చారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సర్పంచ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మానసరాకేష్ వార్డ్ మెంబర్లు రవి, పద్మ,పోశెట్టి, సాయిలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# గిద్ద పాఠశాలలో ఓటర్స్ డే



రామారెడ్డి జనవరి 24 (ప్రజా జ్యోతి)

జాతీయ ఓటర్స్ డె సందర్భంగా గిద్ద ఉన్నత పాఠశాలలో ఓటు విలువను తెలియచేసి ప్రతి సంవత్సరము జాతీయ ఓటర్స్ డె సందర్భంగా గిద్ద పాఠశాలలో ప్రజా స్వామ్య భద్దంగా స్కూల్ ప్యూపుల్ లీడర్(క్యాప్టెన్) నీ పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థులందరు తమ ఓటు హక్కును వినియోగించుకొని పాఠశాల క్యాప్టెన్ ను ఎన్నుకోవడం జరిగింది. ఈ ఎన్నిక ప్రక్రియ మొత్తం ప్రధానోపాధ్యాయులు కన్నయ్య మరియు సోషల్ టీచర్ మహేష్, ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాణిక్యం రెడ్డి,రాజేశ్వర్,భూమేష్, విష్ణువర్ధన్,స్వప్నప్రియ మేడం, కైలాస్ వ్యాయమా ఉపాధ్యాయుడు శ్రీనివాస్, ఖాసిం మరియు అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అరైవ్ అలైవ్ ప్రోగ్రాం పై అవగాహన సదస్సు - ఎస్సై సుహాసిని



మెండోరా:జనవరి/24(ప్రజా జ్యోతి )

మెండోరా మండల కేంద్రంలో జాతీయ రోడ్డు భద్రత వారోత్సవంలో భాగంగా శనివారం రోజున శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఎస్సై సుహాసిని ఆధ్వర్యంలో వాహనదారులకు రోడ్డు భద్రత పై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ గ్రామస్తులకు ట్రాఫిక్ సిగ్నల్స్,జీబ్రా క్రాసింగ్ లైన్ పైన అవగాహన కల్పిస్తూ పలు సూచనలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, మైనర్ వారికి వాహనాలు ఇవ్వొద్దని,హెల్మెట్ ధరించి వాహనం నడపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై సీసీఎస్ మెరుపు దాడి

### 9 మంది అరెస్ట్ నగదు, కార్లు స్వాధీనం

నిజామాబాద్ రూరల్: జనవరి, 24 (ప్రజా జ్యోతి)

అక్రమ పేకాట స్థావరాలపై నిజామాబాద్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. శనివారం సాయంత్రం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య, ఐపీఎస్ ఆదేశాల మేరకు సీసీఎస్ బృందం ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇస్సాపల్లి శివారులో పేకాట స్థావరంపై మెరుపు దాడి నిర్వహించింది.సీసీఎస్ ఏసీపీ ఇన్?చార్జ్ శ్రీ మస్తాన్ అలీ సూచనలతో ఇన్?స్పెక్టర్ డి. సాయినాథ్, ఎస్?ఐ గోవింద్ మరియు సిబ్బంది సంయుక్తంగా దాడి చేయగా, అక్కడ పేకాట ఆడుతున్న 9 మందిని పట్టుకున్నారు.దాడిలోరూ.54,070 నగదు,10 సెల్ ఫోన్లు,3 కార్లు స్వాధీనం చేసుకున్నారు.పట్టుబడిన నిందితులు, స్వాధీనం చేసిన వస్తువులను తదుపరి చర్యల నిమిత్తం ఆర్మూర్ పోలీస్ స్టేషన్ ఎస్?హెచ్?ఓకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.



# అనుకున్నదే అయింది.

- ముందే చెప్పిన "ప్రజా జ్యోతి"
-రజినీ టీచర్ కు డిప్యూటేషన్
- పోచంపాడ్ స్కూల్లో డ్యూటీ
- అధికారుల తీరుపై విమర్శల
- విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రుల ఆగ్రహం
- రాష్ట్రస్థాయిలో పిర్యాదుకు హెచ్చరిక

*బోధన్, జనవరి 24 (ప్రజాజ్యోతి)*

బోధన్ - ఏడపల్లి తెలంగాణ ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్?గా విధులు నిర్వహిస్తూ, తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న పి.రజిని ని పోచంపాడ్ బాలుర గురుకుల పాఠశాలకు డిప్యూటేషన్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం ఆమె అక్కడ విధుల్లో చేరారు. అయితే, ఆరోపణల నేపథ్యంలో ఆమెపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోకుండా, కేవలం మరో పాఠశాలకు డిప్యూటేషన్ చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**- అండదండలు ఉన్నాయా?**

ఉన్నతాధికారుల అండదండలతోనే సదరు టీచర్?పై చర్యలు తీసుకోవడానికి విద్యాశాఖ వెనుకాడుతోందని బాధితుల కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తించారనే విమర్శలు ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఆమెను కేవలం బదిలీ చేసి చేతులు దులుపుకోవాలని చూస్తోందని వారు మండిపడుతున్నారు. ప్రస్తుతం ఆమెకు సంజాయిషీ నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది.

**పిర్యాదుకు సిద్ధమవుతున్న సంఘాలు.**

విచారణ పేరుతో కాలయాపన చేసి, న్యాయం చేయకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ విషయంలో తదుపరి చర్యలు తీసుకోని పక్షంలో జిల్లా కలెక్టర్, రాష్ట్ర మహిళా కమిషన్, హ్యూమన్ రైట్స్ కమిషన్ లను ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు.

**భవిష్యత్తుపై ఆందోళన:**

కేవలం స్థానచలనం చేయడం వల్ల సమస్య పరిష్కారం కాదని, రేపు మరో పాఠశాలలో కూడా విద్యార్థినులకు ఇలాంటి ఇబ్బందులే ఎదురయ్యే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విచారణలో నిష్పక్షపాతంగా వ్యవహరించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకోవడానికి వెనుకాడుతున్న ఉన్నతాధికారులను సైతం ఈ కేసులో పార్టీలుగా చేరుస్తూ ఫిర్యాదు చేస్తామని వారు తేల్చిచెప్పారు.

## ఘనంగా మన్మథ స్వామి 466వ జయంతి ఉత్సవం.

### వసంత పంచమి సందర్భంగా వీరశైవ సమాజ్ ప్రత్యేక కార్యక్రమాలు.





**బోధన్ జనవరి 24 (ప్రజాజ్యోతి)**

వసంత పంచమి సందర్భంగా బోధన్ పట్టణంలోని శ్రీ ఏకచక్రేశ్వర శివాలయంలో పట్టణ వీరశైవ సమాజ్ ఆధ్వర్యంలో ధర్మ ప్రబోధకులు, సంత్ శిరోమణి శ్రీ మన్మథ స్వామి 466వ జయంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సాయంసంధ్యా సమయంలో స్వామివారి చిత్రపటానికి డోలా ఆరోహణం, మంగళ నిరాజనాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కీర్తనలు, భజనలు, అభంగాలతో ఆలయ ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక వాతావరణంతో నింపారు.

అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమాజ ప్రముఖులు పురాణే అజయ్ కుమార్ మాట్లాడుతూ, మన్మథ స్వామి రచించిన సంకీర్తనలు, అభంగాలు నేటికీ మానవీయ విలువలు, ధర్మబోధను ప్రసరిస్తున్నాయని తెలిపారు. గురు--లింగ--జంగమ సిద్ధాంతాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసిన మన్మథ స్వామి బోధనలు వీరశైవ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు.

ఈ జయంతోత్సవాన్ని వీరశైవ జంగమ లింగాయత సమాజ్, భజన మండలి సంయుక్తంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో జంగమ లింగాయత సమాజ్ అధ్యక్షులు నర్సింగ్ అప్ప లక్ష్మణరావు పటేల్, భజన మండలి సభ్యులు శంకర్ అప్ప యాదవ్ రావు పటేల్, సంగు పటేల్, శివ రాజు, నితిన్, రాచప్ప, చెన్నప్ప, పురాణే దిలీప్ కుమార్?తో పాటు మహిళా భక్తులు కమల, గంగాసాగర్, ప్రభావతి, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీనగర్ తండాలో సీసీ టీవీ కెమెరాల ప్రారంభం

**బోధన్ జనవరి 24 (ప్రజాజ్యోతి)**

నిజామాబాద్ జిల్లా గాంధీనగర్ తండా గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ టీవీ కెమెరాలను నిజామాబాద్ ఏసీపీ, రూరల్ సీఐలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చిన్న గ్రామమైనప్పటికీ ప్రజల భద్రత దృష్ట్యా సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామంలో శాంతి భద్రతలు మెరుగుపడేందుకు ఈ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఏర్పాటు చేసిన సీసీ టీవీ కెమెరాలను నేరుగా సీపీ కార్యాలయానికి అనుసంధానం చేయడం జరిగిందని, అక్కడి నుంచే నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని ముందుండి నడిపించిన గ్రామ సర్పంచ్ బైర సురేష్ కృషిని ఏసీపీ, సీఐలు ప్రత్యేకంగా ప్రశంసించారు. గ్రామ భద్రత కోసం ఆయన చూపిన చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే ఉప సర్పంచ్, వార్డు సభ్యుల సహకారం కూడా ప్రశంసనీయమని తెలిపారు. గ్రామ అభివృద్ధి, ప్రజల భద్రత కోసం స్థానిక ప్రజాప్రతినిధులు చూపుతున్న నిబద్ధత ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## బోధన్ లయోలా పాఠశాలలో జోయాలుక్కాస్ ఆఫర్ లాంచింగ్.





**బోధన్ జనవరి 24 (ప్రజాజ్యోతి)**

బోధన్ పట్టణంలోని లయోలా పాఠశాలలో నిర్వహించిన అన్యువల్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జోయాలుక్కాస్ బృందం ప్రత్యేక అతిథులుగా హాజరై, బంగారు, వెండి, డైమండ్ ఆభరణాలపై మేకింగ్ చార్జీలలో 40 శాతం ప్రత్యేక ఆఫర్?ను ప్రకటించారు. ఈ ఆఫర్?ను జోయాలుక్కాస్ ప్రతినిధులు సురేష్, శ్యామ్ సుందర్ చేతుల మీదుగా అధికారికంగా లాంచ్ చేశారు. అనంతరం పాఠశాలలో విద్యారంగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సత్కరించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జోయాలుక్కాస్ ప్రతినిధులు మాట్లాడుతూ, నాణ్యమైన ఆభరణాలను ఆకర్షణీయమైన ఆఫర్లతో వినియోగదారులకు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. అలాగే విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గాంధీనగర్ తండాలో 'అరైవ్ అండ్ అలైవ్' అవగాహన కార్యక్రమం.




**బోధన్ జనవరి 24 (ప్రజాజ్యోతి)**

నిజామాబాద్ జిల్లా గాంధీనగర్ తండా గ్రామంలో రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా నిజామాబాద్ ఏసీపీ, రూరల్ సీఐ ఆధ్వర్యంలో 'అరైవ్ అండ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా యువత ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాద సమయంలో ప్రాణాపాయం నుంచి రక్షణ లభిస్తుందని తెలిపారు. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణ నష్టానికి దారి తీస్తుందని హెచ్చరిస్తూ, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.